మసకబారిన మౌలికం

- పడకేసిన కీలక రంగాలు
- 8 నెలల కనిష్ఠానికి వృద్ధిరేటు
- ఏప్రిల్‌లో 0.5 శాతానికి పరిమితం
- క్షీణించిన క్రూడ్, రిఫైనరీ, ఎరువుల ఉత్పత్తి

దేశంలో పారిశ్రామిక ప్రగతికి కొలమానంగా, ఆర్థికాభివృద్ధికి ప్రామాణికంగా పిలిచే కీలక రంగాలను నిస్తేజం ఆవరించింది.

ముడి చమురు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల తయారీలో నీరసం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది మరి. దేశ, విదేశీ పరిణామాలు మౌలిక రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

గత నెల ఏప్రిల్‌లో 8 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 8 కీలక రంగాల్లో వృద్ధిరేటు కేవలం 0.5 శాతానికే పరిమితమైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా భావిస్తున్న భారత్‌లో ఇది ఎంతమాత్రం ఆమోద యోగ్యం కాదనే చెప్పవచ్చు.

న్యూఢిల్లీ, మే 20: మౌలిక రంగాల్లో వృద్ధి రేటు గాడి తప్పింది. 8 కీలక రంగాల్లో ఉత్పాదకత దారుణంగా పడిపోయింది. గత నెల ఏప్రిల్‌లో బొగ్గు, ముడి చమురు, రిఫైనరీ ఉత్పత్తులు, సహజ వాయువు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు, ఎరువుల రంగాల్లో వృద్ధి 8 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 0.5 శాతానికే పరిమితమైంది. ప్రధానంగా ముడి చమురు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల తయారీ నిరాశాజనకంగా నడిచినట్టు మంగళవారం విడుదలైన అధికారిక గణాంకాలు చెప్తున్నాయి.

4.1%–6.4% మేరకు

గత ఏడాది ఏప్రిల్‌లో కీలక రంగాల ఉత్పాదకతలో వృద్ధిరేటు 6.9 శాతంగా ఉన్నది. దీంతో ఈసారి 6.4 శాతం మేర పడిపోయినట్టు తెలుస్తున్నది. అలాగే అంతకుముందు నెల మార్చిలో 4.6 శాతంగా ఈ వృద్ధిరేటు నమోదైంది. కానీ ఏప్రిల్‌లో 0.5 శాతమే కావడంతో కేవలం నెల రోజుల్లో ఉత్పాదకత రేటు 4.1 శాతం వరకు పతనమైనట్టు తేలింది. ముడి చమురు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల తయారీ వృద్ధి.. గతంతో పోల్చితే మైనస్‌లో ఉన్నది. నిరుడు ఆగస్టులో ఈ రంగాల ఉత్పాదకత రేటు మైనస్ 1.5 శాతంగా నమోదైంది. మళ్లీ ఇప్పుడే ఆ స్థాయి దరిదాపుల్లో సదరు రంగాల్లో వృద్ధిరేటు కనిపించిందని విశ్లేషకులు చెప్తున్నారు.

ఐఐపీపై ప్రభావం

మౌలిక రంగాల్లో చోటుచేసుకున్న నిస్తేజం.. దేశ పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ)ని ప్రభావితం చేయవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్‌లో 8 కీలక రంగాల పనితీరు పెద్ద ఎత్తున పతనమైనట్టు చెప్పారు. ఈ క్రమంలోనే ఏప్రిల్‌లో ఐఐపీ గణాంకాలు దాదాపు 1 శాతం మేర పడిపోవచ్చని అంచనా వేశారు. ఐఐపీలో ఈ 8 కీలక రంగాల వాటానే 40.27 శాతంగా ఉన్నది మరి. ఇదిలావుంటే ఈసారి బొగ్గు, సహజ వాయువు, ఉక్కు, విద్యుత్తు రంగాల ఉత్పాదకత వృద్ధిరేటు కూడా తగ్గుముఖం పట్టింది. వరుసగా ఇవి 3.5 శాతం, 0.4 శాతం, 3 శాతం, 1 శాతం చొప్పున ఉన్నాయి. అయితే సిమెంట్ ఉత్పత్తి 6.7 శాతానికి పెరిగింది. నిరుడు ఇదే ఏప్రిల్‌లో 0.2 శాతంగానే ఉన్నది. మొత్తానికి క్రూడ్, రిఫైనరీ ప్రొడక్ట్స్, ఫర్టిలైజర్ తయారీ పడిపోవడంతో మౌలిక రంగంలోని మిగతా రంగాల ప్రగతి కూడా మసకబారినట్టైంది.

దిగొస్తున్న పుత్తడి

రూ.490 తగ్గిన తులం ధర

న్యూఢిల్లీ, మే 20: బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అధిక ధరల కారణంగా దేశీయంగా డిమాండ్ పడిపోవడంతో కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో అతివిలువైన లోహాల ధరలు దిగొస్తున్నాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల పుత్తడి ధర రూ.97 వేల దిగువకు పడిపోయింది. బులియన్ మార్కెట్లో తులం ధర రూ.490 తగ్గి రూ.96,540గా నమోదైంది. అంతకుముందు ఇది రూ.97,030గా ఉన్నట్లు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం కూడా అంతే స్థాయిలో తగ్గి రూ.96,130గా నమోదైంది. ప్రతీకార సుంకాల విధింపుపై అమెరికా–చైనా దేశాల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కిరానుండటం, రష్యా–ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం సీజ్‌ఫైర్‌కు అంగీకరించే అవకాశాలుండటం ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. బంగారంతోపాటు వెండి ధరలు కూడా తగ్గాయి. కిలో వెండి రూ.1,000 తగ్గి రూ.97,500కి దిగొచ్చింది. మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3,233.68 డాలర్ల వద్ద ఉన్నది.

బొగ్గు ఉత్పాదకత పెంచండి

- సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): టన్ను బొగ్గును కనీసం వెయ్యి రూపాయలకు అందించేలా ఉత్పాదకతను పెంచడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ అధికారులకు దిశానిర్దేశనం చేశారు. సంస్థ జీఎంలు, డిప్యూటీ జీఎంలతో సీఎండీ మంగళవారం ఉన్నత స్థాయి సమీక్షను నిర్వహించారు. సంస్థ పరిధిలోని పాత గనులు మూతబడుతున్న నేపథ్యంలో ఒడిశాలోని నైనీ, కొత్తగూడెంలోని వీకేవోసీ, ఇల్లందులోని జేకేవోసీ, బెల్లంపల్లిలోని గోలేటీ ఓసీల నుంచి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించనున్నామన్నారు. తద్వారా 20 మిలియన్ టన్నుల అదనపు బొగ్గు ఉత్పత్తిని సాధించగలమనే ధీమాను ఆయన వ్యక్తంచేశారు. ఇతర రాష్ర్టాల్లో బొగ్గు బ్లాకులు చేపట్టడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

క్యాండియర్ ప్రచారకర్తగా షారుఖ్



ముంబై, మే 20: ప్రముఖ ఆభరణాల విక్రయదారు కల్యాణ్ జువెల్లర్స్ లైఫ్‌స్టైల్ జువెల్లరీ బ్రాండ్ క్యాండియర్ ప్రచారకర్తగా బాలీవుడ్ బాద్‌షా, అగ్రనటుడు షారుఖ్ ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. కాగా, జాతీయ స్థాయిలో విస్తరించే దిశగా వడివడిగా అడుగులేస్తున్న కల్యాణ్ జువెల్లర్స్.. వ్యూహాత్మకంగానే షారుఖ్‌ను ఎంపిక చేసుకున్నది. ఈ సందర్భంగా క్యాండియర్ డైరెక్టర్ రమేశ్ కల్యాణరామన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనుగోలుదారులు తమ జీవనశైలి, సమాజంలో హోదాను ప్రతిబింబించేలా నగలను కోరుకుంటున్నారని చెప్పారు. తమ జీవితంలోని ప్రత్యేక సందర్భాల్లో మరింత ప్రత్యేకంగా కనిపించేందుకు మిక్కిలి ఆసక్తి కనబరుస్తున్నట్టు పేర్కొన్నారు. అందుకే వారి అభిరుచికి తగ్గట్టుగా కొత్తకొత్త డిజైన్లలో ఆభరణాలను అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. ఈ క్రమంలో తమతో షారూఖ్ ఖాన్ భాగస్వామి కావడంపట్ల ఆనందంగా ఉందన్నారు. షారూఖ్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రేమను వ్యక్తపర్చడానికి, జ్ఞాపకాలు, ప్రత్యేకతను చాటడానికి నగలు ఎల్లప్పుడూ ముందుంటాయన్నారు.

కొత్తగా ఐటీఆర్-యూ

న్యూఢిల్లీ, మే 20: ఐటీ శాఖ ఐటీఆర్–యూను నోటిఫై చేసింది. సంబంధిత మదింపు సంవత్సరం ముగిసిన తర్వాత కూడా నాలుగేండ్లదాకా అప్‌డేటెడ్ ఐటీ రిటర్న్‌ను దాఖలు చేయడానికి ట్యాక్స్‌పేయర్స్‌కు ఇది వీలు కల్పిస్తున్నది. 2025 ఆర్థిక చట్టం కింద రెండేండ్ల నుంచి నాలుగేండ్లకు పొడిగించారు.

రుపీ 16 పైసలు డౌన్

ముంబై, మే 20: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులుపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 16 పైసలు కోల్పోయి 85.58కి జారుకున్నది. గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన అమెరికా ట్రెజరీ ఈల్డ్ తిరిగి బలహీనపడటంతో మారకం విలువ పతనానికి పరోక్షంగా దోహదం చేసింది.

టీవీఎస్ ఎలక్ట్రిక్ ఆటో

ధర రూ.2.95 లక్షలు

చెన్నై, మే 20: ద్వి, త్రిచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ..దేశీయ మార్కెట్‌కు మరో ఎలక్ట్రిక్ ఆటోను పరిచయం చేసింది. టీవీఎస్ కింగ్ ఈవీ మ్యాక్స్ పేరుతో విడుదల చేసిన ఈ ఆటో ధర రూ.2.95 లక్షలుగా నిర్ణయించింది. సింగిల్ చార్జింగ్‌తో 179 కిలోమీటర్లు ప్రయాణించే ఈ ఆటో బ్యాటరీ కేవలం 2.15 గంటల్లోనే 80 శాతం రీచార్జికానున్నది. టీవీఎస్ స్మార్ట్‌కనెక్ట్, నావిగేషన్, అలర్ట్స్, 51.2 వోల్టేల లిథియం అయాన్ బ్యాటరీ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దిన ఈ ఆటో గంటకు 60 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ వాహనంపై ఆరేండ్లు లేదా 1.5 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ సదుపాయం కూడా సంస్థ కల్పిస్తున్నది.

రూ.5.64 లక్షల కోట్లు ఆవిరి

సెన్సెక్స్ 873, నిఫ్టీ 261 పాయింట్ల నష్టం
ఒక్క శాతానికిపైగా నష్టపోయిన సూచీలు

ముంబై, మే 20: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజూ నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో సూచీలు ఒక్క శాతానికి పైగా కోల్పోయాయి. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు మధ్యాహ్నం తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాలకు ఆజ్యంపోశాయి. ఫలితంగా వరుసగా మూడు రోజులుగా తగ్గుతూ వచ్చిన సూచీలు మంగళవారం 82 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. ఇంట్రాడేలో 900 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 872.98 పాయింట్లు లేదా 1.06 శాతం నష్టపోయి 81,186.44 వద్ద ముగిసింది. 27 సూచీలు నష్టపోగా, కేవలం మూడు సూచీలు లాభాల్లో ముగిశాయి. వీటిలో వాహన, ఆర్థిక, రక్షణ రంగ సూచీలు కూడా నిరాశాజనక పనితీరు కనబర్చడం భారీ నష్టాలను అడ్డుకోలేకపోయాయి. మరో సూచీ నిఫ్టీ సైతం 261.55 పాయింట్లు లేదా 1.05 శాతం పతనం చెంది 24,683.90 వద్ద స్థిరపడింది.

రూ.438 లక్షల కోట్లకు..

స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోవడంతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. మంగళవారం రూ.5 లక్షల కోట్లకు పైగా సంపద హరించుకుపోయింది. దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.5,64,594.68 కోట్లు కరిగిపోయి రూ.4,38,03,259.51 కోట్ల(5.13 ట్రిలియన్ డాలర్లకు) పరిమితమైంది. ప్రతీకార సుంకాల విధింపుపై భారత్–అమెరికా మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కిరాకపోవడంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా బ్లూచిప్ సంస్థల షేర్లు నష్టపోయాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- మారుతి, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్, నెస్లె, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు నష్టపోయాయి.
- వీటితోపాటు ఫెడరల్ బ్యాంక్, యెస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, కొటక్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు పతనం చెందాయి.
- కానీ, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఐటీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే వాహన రంగ సూచీ అత్యధికంగా 2.13 శాతం, కన్జ్యూమర్ 1.81 శాతం, యుటిలిటీ 1.64 శాతం, సర్వీసెస్ 1.53 శాతం, ఇండస్ట్రీయల్స్ 1.36 శాతం, టెలికం 1.35 శాతం చొప్పున తగ్గాయి.

ఈసీఐఎల్‌కు మినీరత్న హోదా

చర్లపల్లి, మే 20: కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్)కు మినీరత్న హోదా దక్కింది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ అనురాగ్ కుమార్ మాట్లాడుతూ.. కార్మికులు, అధికారులు అంకిత భావంతో పనిచేయడం వల్లనే మినీరత్న హోదా లభించిందన్నారు. ఆర్థిక మంత్రిత్వశాఖలోని పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్(డీపీఈ) విభాగం నిర్దేశించిన అర్హతను సాధించినందుకు భారత అణుశక్తి విభాగం ఈసీఐఎల్‌కు మినీరత్న కేటగిరి–1 హోదాను కల్పించిందన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో రక్షణ రంగానికి కావాల్సిన ఉత్పత్తులను అందిస్తున్నామని, మినీరత్న హోదాతో స్వయం ప్రతిపత్తిని సాధించడంతో పాటు దేశవ్యాప్తంగా ఈసీఐఎల్ ఖ్యాతి పెరిగిందన్నారు. ఎలక్ట్రానిక్ రంగంలో మరిన్ని ఉత్పత్తులను సాధించేందుకు అధికారులు, కార్మికులు మరింత కృషి చేయాలని ఆయన సూచించారు.

రాష్ట్రంలో ఐటీసీ మరో హోటల్

హైదరాబాద్, మే 20: తెలంగాణలో మరో హోటల్‌ను నెలకొల్పడానికి సిద్ధమైంది ఐటీసీ గ్రూపు. ఇప్పటికే హైదరాబాద్‌లో రెండు హోటళ్లను నిర్వహిస్తున్న ఐటీసీ హోటల్స్..తాజాగా నగరానికి సమీపంలోని శంకర్‌పల్లి వద్ద హోటల్‌ను ఏర్పాటుచేయబోతున్నది. 'వెల్కమ్‌హోటల్ శంకర్‌పల్లి' పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ హోటల్ కోసం కేపీసీ పామ్ ఎక్సోటికా హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో జట్టుకట్టింది. ఇందుకు సంబంధించి ఇరు సంస్థలు మంగళవారం అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ఐటీసీ హోటల్స్ ఎండీ అనిల్ చాదా మాట్లాడుతూ.. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు హోటళ్లను విస్తరిస్తున్నట్టు, దీంట్లోభాగంగా పర్యాటక కేంద్రమైన శంకర్‌పల్లిలో కొత్తగా హోటల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. 11 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ హోటల్‌లో 155 గదులు ఉండనున్నాయి.

అణుశక్తి కమిషన్ మాజీ చీఫ్ శ్రీనివాసన్ మృతి

ఉదకమండలం: అణుశక్తి కమిషన్ మాజీ చైర్మన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ) మాజీ కార్యదర్శి డాక్టర్ ఎంఆర్ శ్రీనివాసన్ (95) కన్నుమూశారు. దేశ అణు ఇంధన కార్యక్రమంలో కీలకపాత్ర పోషించిన డాక్టర్ ఎంఆర్ శ్రీనివాసన్ మంగళవారం తమిళనాడులోని ఉదకమండలంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. 1955 సెప్టెంబర్‌లో డీఏఈలో చేరిన డాక్టర్ శ్రీనివాసన్.. భారత అణు కార్యక్రమ పితామహుడు డాక్టర్ హోమీ బాబాతో కలిసి కెరీర్‌ను ప్రారంభించారు. వీరిద్దరు కలిసి దేశ తొలి అణు పరిశోధన రియాక్టర్ 'అప్సర' నిర్మాణంలో పాలుపంచుకున్నారు. 1959లో భారత తొలి అణు విద్యుత్తు కేంద్ర నిర్మాణానికి ప్రిన్సిపల్ ప్రాజెక్టు ఇంజినీర్‌గా నియమితులైన డాక్టర్ శ్రీనివాసన్.. 1967లో మద్రాస్ అణు విద్యుత్తు కేంద్రం (మ్యాప్స్) చీఫ్ ప్రాజెక్టు ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో ఆయన నాయకత్వంలోనే దేశ అణు కార్యక్రమం రూపుదిద్దుకోవడం మొదలైంది. ఆ తర్వాత జాతీయ ప్రాధాన్యమున్న అనేక పదవులను చేపట్టిన డాక్టర్ శ్రీనివాసన్.. 1987లో అణుశక్తి కమిషన్ చైర్మన్‌గా, డీఏఈ కార్యదర్శిగా, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) వ్యవస్థాపక చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన నాయకత్వంలో అభివృద్ధి చేసిన 18 న్యూక్లియర్ పవర్ యూనిట్లలో ఇప్పటివరకు 7 కార్యరూపం దాల్చి పనిచేస్తున్నాయి. మరో 7 యూనిట్లు నిర్మాణ దశలో ఉన్నాయి.

ఖగోళ శాస్త్రవేత్త డాక్టర్ నార్లికర్ ఇకలేరు

పుణె: ప్రఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ (86) ఇక లేరు. హూయల్–నార్లికర్ గురుత్వాకరణ సిద్ధాంతంతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఆయన పుణెలో కన్నుమూశారు. ఖగోళ శాస్త్రానికి ఎనలేని సేవలు అందించిన డాక్టర్ నార్లికర్ మంగళవారం తెల్లవారుజామున నిద్రలోనే తుదిశ్వాస విడిచినట్టు కుటుంబసభ్యులు వెల్లడించారు. దేశంలో అత్యున్నత పరిశోధనా సంస్థలను నెలకొల్పి, భారత వైజ్ఞానిక రంగంలో మహోన్నత వ్యక్తిగా నిలిచిన డాక్టర్ నార్లికర్ ఇటీవల పుణెలోని ఓ హాస్పిటల్‌లో తుంటెకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. డాక్టర్ నార్లికర్ అంత్యక్రియలు బుధవారం జరుగనున్నాయి. ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. 1938 జూలై 19న జన్మించిన డాక్టర్ నార్లికర్ బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ) క్యాంపస్‌లో తొలి దశ విద్యను అభ్యసించారు. ఆయన తండ్రి విష్ణు వాసుదేవ నార్లికర్ అదే యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా, గణితశాస్త్ర విభాగాధిపతిగా సేవలందించారు. ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్‌కి వెళ్లిన డాక్టర్ నార్లికర్.. మ్యాథమెటికల్ ట్రిపోస్‌లో వ్రాంగ్లర్ అండ్ టైసన్ పతక విజేతగా నిలిచారు. బ్రిటన్‌లో ఉన్నప్పుడే తన డాక్టోరల్ అడ్వైజర్ ఫ్రెడ్ హూయల్‌తోపాటు ప్రఖ్యాత శాస్త్రవేత్తలతో కలిసి ప్రఖ్యాత హూయల్–నార్లికర్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని రూపొందించిన డాక్టర్ నార్లికర్.. 1972లో భారత్‌కు తిరిగొచ్చి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్‌లో చేరారు.

అనుమతి లేని కాలేజీలు, కోర్సుల్లో చేరొద్దు

- ఎన్‌ఎంసీ హెచ్చరిక

న్యూఢిల్లీ: అనుమతి లేని కళాశాలలు, కోర్సుల్లో చేరొద్దని జాతీయ వైద్య మండలి(ఎన్‌ఎంసీ) వైద్య విద్యార్థులను మంగళవారం హెచ్చరించింది. ఇలాంటి కాలేజీల్లో చదవడం వల్ల ఎఫ్‌ఎంజీఈ లైసెన్సింగ్ పరీక్షకు అనర్హులవుతారని తెలిపింది. ఇలాంటి కాలేజీలు తమకు గుర్తింపు ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తప్పు దోవ పట్టిస్తూ అడ్మిషన్లను ఆఫర్ చేస్తున్నాయని పేర్కొంది. ఆయా కళాశాలల చట్టబద్ధ గుర్తింపును ధృవీకరించుకొనేందుకు ఎన్‌ఎంసీ అధికారిక వెబ్‌సైట్‌లోని అనుమతి పొందిన కళాశాలల జాబితాను పరిశీలించాలని కోరింది. అవసరమైతే నేరుగా తమను సంప్రదించొచ్చని చెప్పింది. కాలేజీల వెబ్‌సైట్లు, ప్రకటనల మీద ఆధారపడొద్దని, మెడికల్ కాలేజీల్లో ప్రత్యక్ష అడ్మిషన్లను ఎన్‌ఎంసీ చేపట్టదని తెలిపింది. మరింత సమాచారం కోసం +91–11–25367033 ఫోన్ నంబర్లో తమను సంప్రదించాలని కోరింది. విదేశీ వైద్య విద్య పట్టభద్రుడిగా(ఎఫ్‌ఎంజీఎల్) గుర్తింపు పొందాలంటే ఒకే కళాశాలలో కనిష్ఠంగా 54 నెలల వైద్య విద్యను, అదే విదేశీ విశ్వ విద్యాలయంలో 12 నెలల ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసి ఉండాలని తెలిపింది. మరోవైపు విదేశీ వైద్య పట్టభద్రులు భారత్‌లో కనిష్ఠంగా 12 నెలల పాటు పర్యవేక్షణ కలిగిన ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేస్తే వారికి శాశ్వత రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపింది.

బలమైన ఆధారాలుంటేనే ఉపశమనం

వక్ఫ్ పిటిషన్లపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 20: వక్ఫ్ (సవరణ) చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమేనన్న భావన సర్వత్రా ఉందని, అయితే వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తున్న పిటిషనర్లు తమకు మధ్యంతర ఉపశమనం దక్కాలంటే బలమైన, విస్పష్టమైన ఆధారాలు చూపించాల్సిన అవసరం ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిహ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం వక్ఫ్ చట్టం చట్టబద్ధతను సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ ప్రారంభించింది. వక్ఫ్ బై కోర్ట్స్, వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ బై డీడ్‌గా ప్రకించిన ఆస్తులను డీనోటిఫై చేసే అధికారంతో సహా మూడు అంశాలపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్లు కోరుతున్నారు. 'పార్లమెంట్ ఆమోదించిన ప్రతి చట్టం రాజ్యాంగబద్ధమేనన్న భావన ఉంది. మధ్యంతర ఉపశమనం మీకు లభించాలంటే బలమైన, విస్పష్టమైన ఆధారాలు మీరు చూపించాలి. లేకపోతే రాజ్యాంగబద్ధత భావన అలాగే ఉంటుంది' అని సీజేఐ తెలిపారు.

మూడు అంశాలకే పరిమితం కావాలి

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తన వాదన ప్రారంభిస్తూ వక్ఫ్ చట్టం చారిత్రకంగా, న్యాయపరంగా, రాజ్యాంగ సూత్రాల పరంగా పూర్తి విరుద్ధమని అభివర్ణించారు. న్యాయ వ్యవస్థ రహిత ప్రక్రియ ద్వారా వక్ఫ్‌ని స్వాధీనం చేసుకునే మార్గంగా ఆయన ఈ చట్టాన్ని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ మూడు అంశాలకే పిటిషన్లపై విచారణ పరిమితం కావాలని అభ్యర్థించారు. వక్ఫ్ బై కోర్ట్స్, వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ బై డీడ్‌గా ప్రకటించిన ఆస్తులను డీనోటిఫై చేసే అధికారం ఈ మూడు అంశాలలో ఒకటి. రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ కూర్పునకు సంబంధించినది రెండో అంశం. ఎక్స్ అఫిషియో సభ్యులు తప్ప మిగిలిన సభ్యులందరూ ముస్లింలే ఉండాలన్నది పిటిషనర్ల వాదన. ఇక మూడవది, వక్ఫ్ ఆస్తా లేక ప్రభుత్వ ఆస్తా అన్న విషయాన్ని నిర్ధారించడానికి కలెక్టర్ విచారణ చేపట్టిన తర్వాత ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనను పిటిషనర్లు వ్యతిరేకిస్తున్నారు. కాగా, తుషార్ మెహతా వాదనను కపిల్ సిబల్‌తోపాటు పిటిషనర్ల తరపున హాజరైన మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ ఎం సింఘ్వి వ్యతిరేకించారు. విచారణ భాగాలుగా ఉండదని వారు వాదించారు. వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్న ప్రయత్నమని, ఏ అంశాలను ప్రస్తావించాలో ప్రభుత్వం నిర్దేశించలేదని సిబల్ పేర్కొన్నారు. న్యాయపరమైన ప్రక్రియ లేకుండా కార్యనిర్వాహక మార్గం ద్వారా వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు చట్ట నిబంధనలు సవరించారని సిబల్ వాదించారు. బాధిత కక్షిదారులు కోర్టులను ఆశ్రయించేందుకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వు ద్వారా వక్ఫ్ ఆస్తులను వక్ఫ్ నుంచి తప్పించనున్నారని ఆయన చెప్పారు.

ఐసీయూ నుంచి.. ఐఎఫ్ఎస్ అధికారిగా

దేవానంద్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): ఆ యువకుడు తీవ్రమైన కొవిడ్ భారినపడ్డాడు. 80 శాతం ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. దాదాపు నాలుగు నెలలు ఐసీయూలోనే గడిపాడు. ఇది చాలదంటూ రెండుసార్లు గుండెపోటు. మొత్తంగా మృత్యువు నుంచి బయటపడ్డారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) ఎగ్జామినేషన్‌లో 112వ ర్యాంకును సాధించారు. ఆయనే టెల్గోట్ దేవానంద్. మహారాష్ట్రకు చెందిన దేవానంద్ సివిల్స్ ఇంటర్వ్యూకు వెళ్లి వస్తుండగా, 2021లో కొవిడ్ బారినపడ్డాడు. తెలంగాణ అదనపు డీజీపీ మహేష్ భగవత్ సహాయంతో విమానంలో ఆయన్ను హైదరాబాద్‌కు తీసుకొచ్చి బేగంపేట కిమ్స్ దవాఖానలో చేర్పించారు. నాలుగు నెలలు ఐసీయూలోనే ఉన్నాడు. మరో మూడు నెలలు సాధారణ వార్డులో ఉన్నారు. చికిత్స దశలో రెండుసార్లు గుండెపోటు వచ్చింది. ఎక్మో చికిత్సతో కోలుకున్నాడు. ఇంట్లో అనేక జాగ్రత్తలు తీసుకుంటూ తన ప్రిపరేషన్‌ను కొనసాగించారు. తాజాగా విడుదలైన ఐఎఫ్ఎస్ ఫలితాల్లో మంచి ర్యాంకును సాధించాడు. చికిత్స, ఇంటర్వ్యూల కోసం మహేష్ భగవత్ ఎంతగానో సహాయం చేశారని దేవానంద్ గుర్తుచేసుకున్నారు. తాను ఐఏఎస్ అయ్యే వరకు విశ్రమించనని ఆయన అంటున్నారు.

సత్తాచాటిన తెలంగాణ అభ్యర్థులు

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) ఎగ్జామినేషన్ ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తాచాటారు. నల్లగొండకు చెందిన చాడ నిఖిల్ రెడ్డి 11వ ర్యాంక్, కరీంనగర్‌కు చెందిన చెరుకు అవినాష్‌రెడ్డి 40వ ర్యాంకు, జీ ప్రశాంత్‌రెడ్డి 25వ ర్యాంకు సాధించారు

తల్లిదండ్రులతో నిఖిల్ రెడ్డి

ఐఎఫ్ఎస్ ఫలితాల విడుదల..
కనిక అనభ్‌కు టాప్ ర్యాంక్

యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్)–2024 పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. ఇందులో కనిక అనభ్ మొదటి ర్యాంక్ సాధించారు. మొత్తం 143 మంది అభ్యర్థులను నియమించాలని యూపీఎస్సీ కేంద్రానికి సిఫారసు చేసింది. ఇందులో 40 మంది అభ్యర్థులు జనరల్ క్యాటగిరీలో, 19 మంది ఆర్థికంగా వెనుకబడిన వర్గాల క్యాటగిరీలో, 50 మంది ఓబీసీ విభాగంలో, 23 మంది ఎస్సీ, 11 మంది ఎస్టీ క్యాటగిరీలో ఎంపికయ్యారు.

14 వేల మంది చిన్నారులు చనిపోవచ్చు!

- గాజాలో పరిస్థితిపై ఐరాస

లండన్, డెయిర్ అల్–బలాహ్: మరింత మానవతా సాయాన్ని అనుమతించకపోతే గాజాలో రానున్న 48 గంటల్లో 14 వేల మంది దాకా చిన్నారులు చనిపోవచ్చని ఐక్యరాజ్యసమితి మంగళవారం ఆందోళన వ్యక్తం చేసింది. మిత్ర దేశాల ఒత్తిడితో ప్రస్తుతం ఇజ్రాయెల్ పరిమితంగా మాత్రమే మానవతా సాయం కింద ఆహారం తదితరాలను గాజా స్ట్రిప్‌లోకి అనుమతిస్తున్నది. అయితే ఆ పరిమిత సాయం 'సముద్రంలో నీటి బొట్టంత' అని యూఎన్ మానవతా సాయం విభాగం అధ్యక్షుడు టామ్ ఫ్లెచర్ అన్నారు. 'పోషకాహార లేమి వల్ల తమ పిల్లలకు పాలు కూడా ఇవ్వలేని స్థితిలో అక్కడి తల్లులు ఉన్నారు. అలాంటి అమ్మలకు తగిన ఆహారం అందివ్వడానికి మేం అన్ని రకాల ప్రమాదాలను ఎదుర్కొంటున్నాం' అని ఫ్లెచర్ బీబీసీ రేడియో 4తో మాట్లాడుతూ అన్నారు.

తాజా దాడుల్లో 60 మంది దుర్మరణం

మంగళవారం గాజా స్ట్రిప్‌లోని ఖాన్ యూనిస్, గాజా సిటీ, డెయిర్ అల్–బలాహ్ తదితర ప్రాంతాల్లో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో కనీసం 60 మంది మృతి చెందారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వెల్లడించింది. పునరావాస కేంద్రంగా మారిన ఇండ్లు, బడిపై జరిగిన దాడిలో 18 మంది మృతి చెందారు.

7 నెలల్లో 25 మందితో పెండ్లి!

- విలువైన వస్తువులతో ఉడాయింపు
- వరుడిగా అవతారమెత్తి నిత్య పెళ్లి కూతురి ఆటకట్టించిన పోలీస్

భోపాల్: ఏడు నెలల్లో 25 మందిని పెండ్లాడి విలువైన వస్తువులతో ఉడాయించిన నిత్య పెళ్లి కూతురు అనురాధ(23)ను మధ్యప్రదేశ్ పోలీసులు సోమవారం వల పన్ని పట్టుకున్నారు. పక్కా ప్లాన్ ప్రకారం నిర్వహిస్తున్న ఈ పెండ్లి స్కామ్ రాకెట్‌లో ఆమెను ప్రధాన నిందితురాలిగా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్యంగా ఎంచుకొన్న మగవాళ్లను నిందితురాలు చట్టబద్ధ పద్ధతిలో పెండ్లి చేసుకొని కొన్ని రోజులకే వాళ్లకు సంబంధించిన డబ్బు, నగలు, విలువైన వస్తువులతో ఉడాయించేది. పోలీసులకు ఫిర్యాదులు రావడంతో సవాయ్ మాధోపూర్ కానిస్టేబుల్ ఒకరు వరుడి అవతారమెత్తి తన వివరాలను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసి ఏజెంట్లను సంప్రదించాడు. వాళ్లు ఆయనకు అనురాధ ఫొటో పంపగానే తన సహచర పోలీసుల సాయంతో దాడి చేసి నిందితురాలిని భోపాల్‌లో అరెస్ట్ చేశారు.

బెస్ట్ ఎర్త్ సైన్స్ సైంటిస్టుల్లో హైదరాబాద్ ప్రొఫెసర్

హైదరాబాద్, మే 20: హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్, ఆంధ్రా యూనివర్సిటీ భూ విజ్ఞాన శాస్త్ర మాజీ విభాగాధిపతి ప్రొ.ఎన్ సుబ్బారావు అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. స్వతంత్ర విద్యా ర్యాంకింగ్ వేదిక అయిన రిసెర్చ్.కామ్ సంకలనం చేసిన ఉత్తమ భూ శాస్త్ర శాస్త్రవేత్తలు 2025 జాబితాలోఆయన చోటుదక్కించుకున్నారు. ఆయన ఎర్త్‌సైన్స్‌లో భారత్‌లో 44వ ర్యాంక్, ప్రపంచ వ్యాప్తంగా 6,329 ర్యాంక్‌ను దక్కించుకున్నట్టు రిసెర్చ్.కామ్ వెల్లడించింది. ఆయన ఇప్పటివరకు ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో 130కి పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఆయన భారత ప్రభుత్వం నుంచి జాతీయ ఖనిజ అవార్డు (2009), రాష్ట్ర శాస్త్రవేత్త అవార్డు (2009), ఏపీ ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు (2014) పొందారు.

టైమ్ దాతృత్వశీలురుల్లో అంబానీ దంపతులు

న్యూయార్క్: ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ తొలిసారిగా దాతృత్వశీలుర జాబితాను విడుదల చేసింది. 2025 ఏడాదికిగానూ దాతృత్వంలో టాప్–100 జాబితాలో మన దేశం నుంచి పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ దంపతులు, విప్రో మాజీ చైర్మన్ అజిమ్ ప్రేమ్‌జీ, జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌లకు స్థానం లభించింది. అంబానీ దంపతులు 2024లో రూ.407 కోట్లను విరాళంగా ఇచ్చి దేశంలోనే అతిపెద్ద దాతలుగా నిలిచారు. విద్య, గ్రామీణ అభివృద్ధి రంగాలకు భారీ స్థాయిలో విరాళాలు అందిస్తూ అజిమ్ ప్రేమ్‌జీ దాతృత్వంలో ముందున్నారు. ఇక యువ భారతీయులను దాతృత్వాన్ని ప్రోత్సహించేలా నిఖిల్ కామత్ 'గివింగ్ ప్లెడ్జ్' వంటి వినూత్న సామాజిక దాతృత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.